ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

1

శుక్రవారం 26 ఏప్రిల్ 2024





నెరవేరని జలకళ

● నరసరావుపేట మండలం పమిడిమర్రు ప్రాంతంలో నిర్మించిన వ్యవసాయ బోరు

జలకళ పథకాన్ని అటకెక్కించారు. ఎన్‌టీఆర్ జలసిరి.. వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చేసిన ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. పేరు మార్చుకోవడంలో శ్రద్ధ చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకం అమలుకు పైసలివ్వలేదు. సాగునీటి సంక్షోభంలో జలకళ అన్నదాతలను ఆదుకోలేక పోయింది. ప్రభుత్వం వ్యవసాయ బోర్లు నిర్మించి ఉంటే రైతులు పంటలు సాగు చేసేవారు. సాగునీరు లేక జిల్లాలో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశపెట్టిన జలకళ పథకం అమలులో ప్రభుత్వం బొక్కబోర్లా పడింది. మూడున్నరేళ్ళుగా జలకళను ప్రభుత్వం సాగదీసింది. బోర్ల నిర్మాణానికి నిధులు కేటాయిండంలో చేతులెత్తేసింది. ఇప్పటికి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. జలకళ అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల రైతులకు తీరని అన్యాయం చేసింది.

● మూడున్నరేళ్లు.. 139 బోర్లు
● బోర్ల పథకం అమలులో బొక్కబోర్లా
● రైతులకు అక్కరకురాని జలకళ
● బోర్లు నిర్మించి ఉంటే పంటలు పండేవి
● మొక్కుబడిగా బోర్ల నిర్మాణం
● ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ద్రోహం
● ఇదీ జలకళలో జగనన్న సాధించిన ఘనత

జలకళ పురోగతి క్లస్టర్‌ల వారీగా ఇలా..

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	అమోదించినవి	నిర్మించిన బోర్లు
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,895	1,532	134
మాచర్ల	5,072	4,178	757
వినుకొండ	2,597	1,986	203
బాపట్ల	314	236	76
చీరాల	4,241	1,547	821
గుంటూరు	198	157	11
తెనాలి	283	234	149
మొత్తం	15,423	10,585	2,235

● బోర్ల నిర్మాణానికి దరఖాస్తులు : 15,423
● అమోదించిన దరఖాస్తులు : 10,545
● నిర్మించిన బోర్లు : 2,235
● బోర్లు నిర్మాణం శాతం : 21.94
● విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చిన బోర్లు : 263
● మోటార్లు అమర్చిన బోర్లు : 139
● నిరూపయోగంగా ఉన్న బోర్లు : 2,096

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బోర్ల నిర్మాణం కోసం రైతులు కళ్ల కాయలు కాసేలా ఎదురుచూశారు. మొక్కు బడిగా జలకళను అమలు చేశారు. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు బోర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై వారు నోరు మెదపలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 15,423 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 10,545 దరఖాస్తులను ఆమోదించినప్పటికీ 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 21.94 శాతమే. నిర్మించిన బోర్లకు బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.22.56 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.72.36 లక్షలు చెల్లించారు. దీంతో బోర్ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంలో వేలాదిమంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కళ్లు కాచేలా ఎదురు చూశారు..

చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు జళకలను ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టి అమలులో చతికిలపడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం కళ్ల కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వ్యవసాయంపై ఆధారపడిన

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా బోర్ల నిర్మాణం ఇలా


వర్గం	దరఖాస్తులు	అమోదించినవి	బోర్ల నిర్మాణం
ఎస్టీ	2,745	2,256	191
ఎస్సీ	1,616	1,294	209
మైనార్టీ	271	213	34
బీసీ	5,499	4,579	1,097
మొత్తం	10,131	8,342	1,531



రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్న, సన్న కారు రైతులను ఉచిత బోరు బావుల పథకం ఆదుకోలేకపోయింది. వ్యవసాయ యోగ్యమైన భూమి ప్రతి ఎకరానికి సాగులోనికి తెస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణను విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు అడియాసే మిగిలింది. ప్రధానంగా నిధుల కొరత వెంటాడుతోంది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు నిర్మించి ఉంటే వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసి ఉండేవారు.

ఆ రైతులకు తీరని అన్యాయం

సీఎం జగన్ నా అని చెప్పుకొనే అన్నదాలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు బోర్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కూడా బోర్ల నిర్మాణం చేపట్టలేదు. అదే బోర్లు నిర్మించి ఉంటే కరువు పరిస్థితుల్లో సదరు రైతులు పంటలు పండించి ఆర్థిక లబ్ధి పొందేవారు. జగన్ వైఖరి కారణంగా ఆయా వర్గాలు సాగు చేసిన పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోయారు. ఆయా వర్గాలకు చెందిన 10,191 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు మంజూరు లోనూ అన్యాయమే జరిగిందనేది లెక్కలు చెబుతున్నాయి. 8,342 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వీరికి సంబంధించిన బోర్ల నిర్మాణం తీవ్ర జాప్యం జరుగు తోంది. ఆమోదించిన దరఖాస్తులలో కేవలం 1,531 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 18.35 శాతానికే మూడేళ్లుగా పరిమితం అయ్యాయంటే నా.. నా అని చెప్పుకోనే వాళ్ల విషయంలోనూ జగన్ కు చిత్తశుద్ధి లేదనేది వాస్తవం అని జలకళ స్పష్టం చేస్తోంది.



వెల్దుర్తి మండలంలో బోరు నిర్మాణం

నిర్మించిన బోర్ల విషయానికి వస్తే..!

జలకళ కింద నిర్మించిన బోర్లుకు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఇవ్వడంలోనూ అలసత్వం తాడవిస్తోందని చెప్పవచ్చు. 2,235 బోర్లు జిల్లాలో నిర్మించారు. మూడు జిల్లాల్లో 263 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. వీటిలో కేవలం 139 బోర్లకు మోటార్లు అమర్చారు. 2,096 బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల విడుదల తీవ్ర జాప్యం వలనే కనెక్షన్‌లు ఆలస్యం అవుతున్నదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 197 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా వీటిలో 60 బోర్లకు మాత్రమే మోటార్లు బిగించారు. బాపట్ల జిల్లాలో 50 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా ఒక్క బోరుకు కూడా మోటారు బిగించకపోవడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 116 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా 79 బోర్లకు మాత్రమే మోటార్లు అమర్చారు. 2,235 బోర్లు నిర్మిస్తే కేవలం 139 బోర్లు మాత్రమే విని యోగంలోకి వచ్చాయంటే ఈ పథకం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని చెప్పవచ్చు. బోర్లు నిర్మించి నెలలు గడుస్తుండటంతో వినియోగించకపోతే అవి పూడిపోతాయన్న ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. జలకళ కింద బోర్లు నిర్మాణ పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లలో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు పండిచి ఆర్థికంగా లబ్ధిపోందేవారు.



ర్యాలీలో కొండయ్య, హీరో నిఖిల్ అభివాదం

చీరాలలో జోష్

● అట్టహాసంగా కొండయ్య నామినేషన్
● ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న కూటమి శ్రేణులు

చీరాల, ఏప్రిల్ 25: భానుడు భగభగ మంటున్నా.. కూటమి శ్రేణుల్లో తగ్గని జోష్.. డోలు, డప్పు వాయిద్యాల సందడి నడుమ గురువారం కూటమి తరపున చీరాల టీడీపీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కొండయ్య నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. మండల పరిధిలోని హస్తినాపురం వినాయకుని గుడి వద్ద గురువారం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన మేనల్లుడు, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ, కుటుంబ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి నామినేషన్ పత్రాలను ఈఆర్వో కార్యాలయంలో సమర్పించేందుకు ర్యాలీగా బయలు దేరా రు. టీడీపీ శ్రేణులు జెండాలు చేపట్టి ర్యా లీలో పాల్గొన్నారు. దీంతో పట్టణం పసుపు మయంగా మారింది. ప్రసాద్ థియేటర్ సెంటర్‌లోని వీరాజంనేయ స్వామి వారి ఆలయం వద్ద వారు చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది. టౌన్‌హాల్ వద్ద కొండ య్య, నిఖిల్ ప్రసంగించారు.

ఆలోచించి.. ఆశీర్వదించండి

ఇప్పటి వరకు జరిగిన పాలన చూశారు.. అన్ని వర్గాలు నష్టపోయాయని ఆలోచించి ఆశీర్వదించాలని కొండయ్య కోరారు. వైసీపీ పాలకులు కింద నుంచి పైదాకా దోచుకో, దాచుకో అన్న చందంగా వ్యవహరించారని ఆరోపించారు. అభివృద్ధి, ప్రశాంతత కావాలంటే తనకు ఓటేయాలని.. కక్షలు, కార్పణ్యాలు కావాలంటే వాళ్లిద్దరని కొండయ్య వివరించారు. యువతకు ఉపాధి లేదని, రైతులకు సాగునీరు లేదని, పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. జాబు కావాలంటే అని కొండయ్య అనగానే శ్రేణులు బాబు రావాలంటూ ప్రతి స్పం దించారు. చీరాలలో పార్టీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఖర్చు చేసిన ప్రతి పైసా తన కష్టార్జితమేనన్నారు. తాను ఎక్కువ మాటలు చెప్పనని, కానీ చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.



నామినేషన్ ర్యాలీలో అభ్యర్థి కొండయ్య, పక్కన ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, సినీ హీరో నిఖిల్

మామయ్య మంచోడు : హీరో నిఖిల్

మామయ్య కొండయ్యను తాను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని ఆయన చాలా మంచోడని సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ తెలిపారు. చెప్పిన మాట తప్పితే చొక్కా పట్టుకుని అడగండంటూ ఉద్వేగభరితంగా మాట్లాడారు. టౌన్‌హాల్ వద్ద ప్రసంగాల అనంతరం ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం మీదగా ఆర్డీవో కార్యాలయానికి చేరింది. నాయకులతో కలసి ఆర్వో సూర్యనారాయణరెడ్డికి కొండయ్య నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఉన్నారు.

249 నామినేషన్లు దాఖలు

● ముగిసిన నామినేషన్ల ప్రక్రియ ● చివరి రోజు పెద్ద సంఖ్యలో దాఖలు
● నేడు పరిశీలన.. 29 వరకు ఉపసంహరణ గడువు

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారంతో ముగిసింది. బాపట్ల లోక్‌సభ, జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 249 నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. ఈ నెల 18 నుంచి మొదలైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. వారం రోజుల పాటు కోలాహలంగా సాగిన ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు మొదలు, వివిధ సంఘాలు, స్వతంత్రులుగా పెద్ద సంఖ్యలో నామినేషన్లను సమర్పించారు. చివరిరోజైన గురువారం నామినేషన్లు జోరందుకున్నాయి. లోక్‌సభ స్థానానికి గురువారం 9 మంది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు లోక్‌సభ స్థానానికి 20 మంది అభ్యర్థులు 34 సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఇక బాపట్ల అసెంబ్లీ స్థానానికి 31 మంది 46 నామినేషన్ సెట్లు దాఖలు చేయగా, అద్దంకికి 21 మంది అభ్యర్థులు 36 సెట్లు దాఖలు చేశారు. రేపల్లెలో 18 మంది అభ్యర్థులు 35 సెట్లు, చీరాలలో 39 సెట్లు, పర్చూరులో 24 మంది 35 సెట్లు, వేమూరులో 17 మంది అభ్యర్థులు 24 సెట్లు దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి సా యంత్రం వరకు నామినేషన్ల పరిశీలన జరగనుంది. 29 వరకు ఉపసంహరణ గడువు ఉండడంతో ఆ తర్వాత తుది బరిలో నిలిచిదేవరో అనే అంశంపై స్పష్టత రానుంది. నామినేషన్ల పర్వం కూడా ముగియడంతో ప్రచారంలో అభ్యర్థులు మరింత దూకుడు పెంచనున్నారు.

తుది ఓటర్ల జాబితా సిద్ధం

◆ 29న విడుదలకు ఏర్పాట్లు
◆ జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సిద్ధమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధమైన తుది ఓటర్ల జాబితాను ఈ నెల 29న విడుదల చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపిన వెంటనే తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయపార్టీలకు, ప్రతీ పోలింగ్ కేంద్రానికి అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. పరిశీలన ముగిసిన తర్వాత నామినేషన్లు ఉపసంహరణ వెనువెంటనే చిహ్నాల కేటాయింపు ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, ఆయా పార్టీల నాయకులు కెవి.రామకృష్ణ, కాగిత కోటేశ్వరరావు, దోనేపూడి రవి, కోటేశ్వరరావు, ఆట్ల బాలాజిరెడ్డి, మాల్యా ద్రి, షేక్.మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

వైసీపీ టీ షర్టుల ఘటనపై కేసు

పేరుపై స్పష్టత ఇవ్వని పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ ఫొటోలతో ఉన్న టీ షర్టులను తరలిస్తున్న ఘటనపై గురువారం చందోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ముగ్గురిపై కేసు నమోదు చేయగా ఇందులో బస్ డ్రైవర్ కూడా ఉన్నారు. పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద బుధవారం చేపట్టిన తనిఖీల్లో ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో 1525 టీ షర్టులతో పాటు 500 ఫ్యాన్ గుర్తుల బెలూన్లను పోలీ సులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. టీషర్టులపై పర్చూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ బొమ్మలు ఉండడంతో పాటు రిసీవింగ్ రశీదుబాలాజీ అనే పేరుతోనే ఉండటంతో తర్జనభర్జనల అనంతరం కోర్టు అనుమతితో కేసు నమోదు చేశారు. కానీ రిసీవింగ్ రశీదులో బాలాజీ అనే పేరు ఉండడంతో ఆ పేరు మీదనే కేసు నమోదు చేశారు. అయితే అతను వైసీపీ అభ్యర్థి అనే విషయంపై పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు.

జీఎస్టీ పరిధిలోకి అని...

బుధవారం ప్రచార సామగ్రి దొరకగానే వాటికి సంబంధించి కొనుగోలు బిల్లులు చూపెట్టి డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌లో తిరిగి వాటిని తీసుకెళ్లొచ్చనే వాదనను పోలీసులు వినిపించారు. కానీ టీషర్టులనేవి ఓటర్లను ప్రలోభపరిచే సామగ్రి కిందకే రావడంతో పాటు వాటి విలువ ప్రకారం చూసుకున్నా నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయాల్సి రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు ఎన్నికల పరిశీలకులు కెప్టెన్ ఎంఎ అయ్యప్పకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

పోలీసు పరిశీలకుడు కెప్టెన్ అయ్యప్ప

బాపట్ల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సమర్థంగా ఎన్నికలు నిర్వహించాలని బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పోలీసు ఎన్నికల పరిశీలకుడు కెప్టెన్ ఎంఏ అయ్యప్ప అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎన్నికలకు సంబంధించి పోలీసుశాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలు, పోలింగ్ స్టేషన్ల వద్ద కల్పిస్తున్న భద్రతా ఏర్పాట్ల గురించి ఆయన వివరాలు తీసుకున్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు గురించి ఎస్పీతో చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తదితరులు ఉన్నారు.



ఆటోనగర్ కార్మికులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన నజీర్, నంబూరు సుభాని, దేగల ప్రభాకర్

టీడీపీతోనే ఆటోనగర్ అభివృద్ధి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తేల్చిచెప్పారు. గుంటూరు ఆటోనగర్‌లో గురువారం జరిగిన మోటార్ ఫీల్డ్ అసోసియేషన్ ఆత్మీయసమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్ అభివృద్ధిని విస్మరించారని, ఎంతో మంది జీవనోపాధి పొందుతున్న మోటారు వర్కర్లపై ఎమ్మెల్యే ముస్తఫా చిన్నచూపు చూశారని ఆరోపించారు. మౌలిక సదుపాయాలు లేక ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వంలో హామీలు ఇచ్చారు తప్ప ఇటువైపు తిరిగి చూడలేదని విమర్శించారు. ముస్లింలను కూడా వైసీపీ పట్టించుకోలేదని, గతంలో ముస్లిం మైనారిటీలను టీడీపీ ప్రభుత్వం అనేక రాజకీయ పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్టాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ ఆటోనగర్ వ్యాపారులకు, మెకానిక్‌లకు అండగా ఉంటామన్నారు. దుకాణాలు లేని వారికి కొత్తగా దుకాణాలు నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు నంబూరు సుభాని, రావి వెంకటరమణ, టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, నాయకులు షబ్బీర్, ముజీబ్, భరత్ రెడ్డి, ఉగ్గిరాల సీతారామయ్య, గౌస్, ఆటోనగర్ నాయకులు అబ్దుల్లా, ఖలీల్, భాషా, ముకబుల్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో జంగాకు అరుదైన గౌరవం

● నరసరావుపేట పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియామకం



జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్25: ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి టీడీపీలో సముచిత స్థానం లభించింది. వైసీపీని వీడి గత నెలలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తిని టీడీపీ నరసరావుపేట పార్లమెంటరీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈమేరకు అధినేత చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం లభిస్తుందనేందుకు జంగా నియామకమే నిదర్శనమని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తిని యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు.

తనిఖీల్లో నగదు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రూ.1,00,000, రూ.81,000 నగదు సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఏప్రిల్ 25వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,43,07,165ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

సాగునీరు, ఉద్యోగాల కల్పనే లక్ష్యం



టీడీపీలో చేరిన తిమ్మాపురం వారితో జీవీ, లావు శ్రీకృష్ణదేవరాయులు

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు
● వైసీపీని వీడి పలువురు టీడీపీలోకి చేరిక..

వినుకొండటౌన్, ఏప్రిల్ 25: నియోజకవర్గం నుంచి పలు గ్రామాలకు చెందిన వారు అధికార వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నూజండ్ల మండలం తిమ్మాపురం గ్రామం 11 కుటుంబాలు, వినుకొండ పట్టణం 2వ వార్డుకు చెందిన 5 కుటుంబాలు, బొల్లాపల్లి మండలం కనుమలచెరువు గ్రామం నుంచి 5కుటుంబాల వారికి వినుకొండలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ అభ్యర్థి శ్రీలావు కృష్ణదేవరాయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను తట్టుకోలేని వందలాది కుటుంబాలు నేడు పార్టీని వీడుతున్నారని, అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జీవీ మాట్లడుతూ బొల్లా అవినీతి అక్రమాలు మితిమీరిపోయాయని, బొల్లా గెలుపుకోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలు గుర్తింపు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానంగా గ్రామాల్లో మంచినీటి సౌకర్యం తోపాటు రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రాక్షస పాలన అంతమొందించాలన్నారు. నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మ్యేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు ప్రజల నుంచి విశేష ఆదారణ లభించిందన్నారు. ప్రజలంత కలిసికట్టుగా కులమతాలకు అతీతంగా తెలుగుదేశంపార్టీకి ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రాథమిక స్థాయి నుంచే
భాష్యం ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ

● జాతీయ స్థాయి ర్యాంకుల సాధనకు ఇదే మార్గం
● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ



ర్యాంకర్లకు కేక్ తినిపిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 25: ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం ఐఐటి ఫౌండేషన్‌కరిక్యులమే ఐఐటి జేఈఈ ర్యాంకుల సాధనకు కారణమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ఐఐటి, మెడిసిన్ కోసం కోచింగ్ క్యాంపస్‌లు లేవని గుంటూరులోనే 6వ తరగతి నుంచే ఐఐటి ఫౌండేషన్‌మెడిసిన్ కోసం తరగతులు ప్రారంభించి శిక్షణ అందిస్తామని వివరించారు. ఫలితంగా ఇటు ఐఐటీల్లో, అటు మెడిసిన్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలోనే ఎం. జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకును, ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకును, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకును కైవసం చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆలిండియా స్థాయిలో డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే. వివేక్ 33, జీ. జాన్ 49, కే. హర్షిత 50 , పి.శ్యామ్ 62, జే. మణిప్రదీప్ 69, కే. చైతన్య 77, ఎ.గణేషదత్తా 78, కే.శ్రేయ 82 ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకర్లను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావులు, భాష్యం ఐఐటి జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు అభినందించారు.

ఐఐటి బాంబేలో సీటు సాధనే లక్ష్యం



జేఈఈ అడ్వాన్స్ లో మెరుగైన రాంకు సాధించిన ఐఐటిబాంబేలో కంప్యూటర్‌సైన్స్ సీటు సాధించడమే లక్ష్యమని జేఈఈ మెయిన్స్‌లో 18 వర్యాంకు సాధించిన ఎం.జిష్ణుసాయి పేర్కొన్నారు. భాష్యం అధ్యాపకుల ప్రత్యేక ప్రణాళికతో కూడిన బోధన, గౌడెన్స్‌లతో పాటు తల్లిదండ్రులు జ్యోతికృష్ణమోహన్ ప్రోత్సాహంతో ఉందన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు




జాతీయ స్థాయిలో జరిగే పరీక్షలో ఒత్తిడినిఅధిగమిస్తే మెరుగైన ర్యాంకు సాధించవచ్చునని జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు సాధించిన ఎం సాయి యశ్వంత్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు అరుణారెడ్డి,రామేశ్వర్ ప్రోత్సహం మరవలేని దన్నారు. 6వ తరగతి నుంచే అధ్యాపకులు ఇచ్చిన ప్రణాళికతో నూరుశాతం పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

బూత్ వద్ద నన్ను బలిస్తారట..

● టీడీపీ నేత అంకారావు యాదవ్
● వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

కారంపూడి, ఏప్రిల్ 25: ఎన్నికల రోజున పోలింగ్ బూత్ వద్ద నన్ను బలిస్తామని వైసీపీ నేతలు డీలర్ సూరె వెంకయ్య, మోసయ్య బ్రదర్స్ బెదిరిస్తున్నారని, గురువారం ఉదయం తనపై దాడి చేసి వెళ్లారని టీడీపీ నేత అంకారావు అన్నారు. మండలంలోని చింతపల్లిలో జరిగిన ఈదాడి ఘటనపై కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీలో ఇమడలేక ఆపార్టీకి రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో తాను టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఇది సహించలేని మోసయ్య బ్రదర్స్ ఇరువురు తనపై దాడి చేసి హత్య చేస్తామని బెదిరించారన్నారు. మాపార్టీ మారుతావా అంటూ తనపై పిడిగుద్దులు కురిపించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి గెలుపు వన్‌సైడ్ అని తెలిపోయిందన్నారు. ఇది సహించలేకనే వైసీపీనేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంతకింత ప్రతీకారం తీర్చుకుంటామని, బ్రహ్మారెడ్డి నాయకత్వంలో ప్రతి దుర్మార్గుడికి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, సీనియర్ నేత చప్పిడి రాము, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం

కృష్ణానది వద్ద ఏది నిఘా ?

రెంటచింతల, ఏప్రిల్ 25: వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న కృష్ణానది తీరంలో మరింత నిఘాను పెడితే అక్రమాలను అరికట్టవచ్చు. తెలంగాణాలోని చాలా గ్రామాలు ఏపీకి సరిహద్దుగా వున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి చెక్ పోస్టులను ఇరువైపులా ఏర్పాటు చేశారు.ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉంది. మరపడవలు, తెడ్ల పడవలను వినియోగించి నీటిని దాటుతున్నారు. దీంతో నగదు, మద్యం, నాటుసారా మత్తు పదార్థాలు రహస్యంగా రవాణా చేస్తున్నారు. ఏపీలో మద్యం అన్ని బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ నుంచి రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని మద్యం తాగి చాలా మంది మృత్యువాత పడగా మరికొందరు రోగాల బారిన పడి వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది ఒక ఎస్‌ఐతో సహా మరో 16 మంది ఇరువైపులా డ్యాంపై పహరా కాస్తున్నారు. ఈ క్రమంలో నది ఒడ్డున నిఘాను పెంచితే అక్రమాలను అరికట్టవచ్చు.

సాగర్ కుడి కాలువకు నీటి నిలిపివేత

విజయపురిసౌత్, ఏప్రిల్ 28: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువకు గురువారం అధికారులు నీటిని నిలిపివేశారు. తాగునీటి నిమిత్తం 8 టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా 17 రోజులపాటు విడుదల చేశారు. వాటా పూర్తి కావడంతో నీటిని నిలుపుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీకి ఓట్లు అడిగే అర్హత లేదు

● 1591వ రోజుకు చేరుకున్న రైతుల నిరసనలు

తుళ్లూరు, ఏప్రిల్25: అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీకి ఓట్లు అగిగే అర్హత లేదని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు, నిరసనలు గురువారం నాటికి 1591వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశాడన్నారు. పరిపాలన చేయటం చేత కాని వారు మూడు రాజధానులు పెట్టి ఉద్ధరిస్తామని చెప్పటం హాస్యాస్పదమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

రెండు చోట్ల నగదు పట్టివేత

చిలకలూరిపేట,ఏప్రిల్ 25: ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు గురువారం బొప్పూడి చెక్ పోస్టు వద్ద మొత్తం రూ.3.19 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన మర్లపాటి శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.1.50 లక్షలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరొక సంఘటనలో ఇంకొక వ్యక్తి వద్ద నుంచి రూ.1.69 లక్షలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద
రూ.25,47,324 స్వాధీనం

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 25: నామినేషన్ పర్వం గురువారంతో ముగిసింది. మాచర్ల అసెంబ్లీ స్థానానికి 24 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం స్క్రూట్నీ కార్యక్రమం నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను సాయంత్రానికి వెల్లడిస్తామన్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ.25,47,324 పట్టుకున్నట్లు చెప్పారు. రూ.13.74 లక్షల విలువైన తెలంగాణ మద్యం సీజ్ చేశామన్నారు. వికలాంగులు, 85 పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేందుకు ఫారం-12డి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2 వేల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రధాన రాజకీయ పార్టీలపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదైనట్లు తెలిపారు.

66,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 62,762 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 66,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 45,199 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	8500	13500
273	12000	16000
341	8000	16000
4884	9000	12500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	16000
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

బాధితులకు అండగా ఉంటాం..

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు



చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న శ్రీకృష్ణదేవరాయలు

నసరావుపేటటౌన్, ఏప్రిల్ 25: బాధితులకు అండగా ఉంటామని, ఘటన కారకులు, సూత్రధారులకు కఠినంగా శిక్షపడేలా చూస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం ఈపూరు మండలం ఇనుమెళ్ళలో వైసీపీ మూకల దాడిలో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడులో గొడవలు సృష్టించడం బాధాకరం అన్నారు. ఘటనలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు సీతారామాంజనేయులు, చలమయ్య, నాగార్జున, నాగేశ్వరరావు, కుమారిలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కారుకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాదవ్‌కు ఫోనులో విన్నవించారు. మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.



విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్ తదితరులు

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య

గుంటూరు(విద్య),ఏప్రిల్25: నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఎ) ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరుజోన్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జోన్ విద్యార్థులు అన్ని కేటగిరిల్లో మెరుగైన ర్యాంకులు సాధించారని తెలిపారు. ఎస్.భార్గవ్‌రెడ్డి 36వ ర్యాంకు, కే. సుమంత్‌రెడ్డి 70, పీ.ప్రవీణ్‌కుమార్ 131, కే.లోకేశ్ 157, షేక్ రజియా 166, ఎస్.వెంటక అస్మిత 340, కే.రామగోపాల్ 394, పీ.జ్యోతిక 410, కే.తేజవర్ధన్ 626, వీ.శేషప్రియ 683, పీ.మణికంఠ 793, పీ.రుషితరెడ్డి 924 ర్యాంకులు సాధించారని తెలిపారు. అంతేకాకుండా 1000 లోపు 12 మంది, 2000 లోపు 35 మంది, 5000 లోపు 72 మంది, 10 వేల లోపు 153 మంది ర్యాంకులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల డీన్స్ కిషోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ బాల సుబ్రమణ్యం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా
కనపర్తి శ్రీనివాసరావు



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వున్న కనపర్తి శ్రీనివాసరావుకు పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. ఆమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ ప్రభుత్వంపై గత నాలుగున్నరేళ్లగా ధైర్యంగా పోరాడడమే కాకుండా, దూకుడుగా ముందుకుపోతూ, పార్టీ ఇచ్చిన కార్యక్ర మాలను నిర్వహిస్తున్న ఆయనను పార్టీ గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించింది. జిల్లా నుంచి అనుక పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ చంద్రబాబు కనపర్తి వైపే మొగ్గు చూపారని ఆ మేరకు అచ్చెన్నాయుడికి ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. కాగా తనని ఆ పదవిలో నియమించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రోలింగ్ కారిడార్ బ్లాక్‌తో ఎనిమిది రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోలింగ్ కారిడార్ బ్లాక్ కారణంగా ఎనిమిది రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి మే 22వ తేదీ వరకు నెంబరు. 07783 విజయవాడ - గుంటూరు, నెంబరు 07788 గుంటూరు-విజయవాడ, నెంబరు. 07276 కాచీగూడ-మిర్యాలగూడ, నెంబరు. 07277 మిర్యాలగూడ - కాచీగూడ, ఈ నెల 30 నుంచి మే 23వరకు నెంబరు 07973 నడికుడి - మిర్యాలగూడ, నెంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ, మే 1నుంచి 31 వరకు నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నెంబరు 07792 నడికుడి-కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. నెంబరు. 07779 గుంటూరు-మాచర్ల రైలుని ఈనెల 29 నుంచి మే22 వరకు గుంటూరు-నడికుడి మధ్యన రద్దు చేశామన్నారు. నెంబరు 07780 మాచర్ల-గుంటూరు రైలుని నడికుడి-గుంటూరు మధ్యన రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

నరేంద్రవర్మకు మద్దతుగా టీడీపీలో పెద్ద ఎత్తున చేరికలు

బాపట్ల, ఏప్రిల్ 25 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు మద్దతు తెలియజేస్తూ పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. వివిధ ప్రాంతాలు నుంచి గురువారం పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరగా నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నరేంద్రవర్మ విజయానికి తామంతా కంకణ బద్దులమై పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.

● ప్రముఖ వైద్యులు డాక్టర్ కట్టా సుగుణ్యారావు తన అనుచరులతో కలిసి తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈతేరు గ్రామానికి చెందిన బత్తుల సుబ్బారావు, కట్టా రాధాకృష్ణ, గేరా అర్జున్, కట్టా అబ్రహం, బత్తుల నాగేశ్వరరావు, కట్టా ఏసోబు, డిఎమ్‌పల్లికి చెందిన పల్లికొండ బాబురావుతో పాటు వారి మద్దతుదారులంతా తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి నరేంద్రవర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● బాపట్ల పట్టణంలోని 18వ వార్డు మాజీ కౌన్సిలర్ దివంగత చేజర్ల కోటేశ్వరమ్మ కుమారుడు చేజర్ల సతీష్, చేజర్ల వెంకయ్య, మున్నం నాగేశ్వరరెడ్డి వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని భావించి చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కళ్ళం హరినాధరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, తాతా జయప్రకాష్ నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, చేజర్ల శ్రీనివాసరావు, మల్లంపాటి శేషు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 12వవార్డు వెంగళ్‌విహార్ మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులంతా గురువారం తెలుగుదేశంపార్టీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నరేంద్రవర్మ గెలుపునకు శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, మాజీ కౌన్సిల్ చింతా దేవసహాయం, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, జిట్టా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● పట్టణంలోని 30వ వార్డు ఇస్లాంపేటకు చెందిన 11 మంది వైసీపీ ముస్లిం యువత గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మహ్మద్ సిరాజుద్దీన్, పఠాన్‌జిలానీఖాన్, సయ్యద్ సుభానీ, షేక్ షరీఫ్, షేక్ ఖాజా, పఠాన్ రహమాన్, పఠాన్ మహబూబ్‌ఖాన్, షేక్ మహబూబ్, షేక్ రసూల్, షేక్ మహబూబ్, పఠాన్ అన్వార్‌ఖాన్ పార్టీలో చేరారు.



12వవార్డు మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, ఆయన అనుచరులకు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న నరేంద్రవర్మ

నేడు కుంచాలవారిపాలెం రాంబొట్లపాలెం గ్రామాల్లో అనగాని ప్రచారం

చెరుకుపల్లి, ఏప్రిల్ 25: నేడు కుంచాలవారిపాలెం, రాంబొట్ల పాలెం, కావూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అనగా ని సత్యప్రసాద్ పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లా ది రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ టీడీ పీ, జనసేన, బీజేపీ రాష్ట్ర పార్లమెంట్, నియోజకవర్గ, మండల గ్రామస్థాయి నాయకులు పాల్గొనాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని చెప్పారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నేడు ప్రతిభా పురస్కారాలు

బాపట్ల, ఏప్రిల్ 25 : పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులోని అశోక కన్వెన్షన్‌హాలులో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రతిభాపురస్కారాలు పంపిణీ చేయటం జరుగుతుందని విద్యాసంస్థల అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు గుర్తింపు కార్డుతోపాటు 10వ తరగతిలో సాధించిన మార్కుల జాబితా ఇంటర్నెట్‌లో తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9100069428, 8978480437 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సలహాలు తెలియజేయాలి

బాపట్ల,ఏప్రిల్ 25 : ప్రజలు తమ ఫిర్యాదులు, సలహాలు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చుఅని వేమూరు,బాపట్ల, చీరాల నియోజకవర్గాల పరిశీలకులు పరిమళ్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలు నుండి 10గంటల మధ్య సంప్రదించవచ్చుఅన్నారు. 8500362790,08594-220040 అనే నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

బాపట్ల, ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల మలేరియా జ్వరం వస్తుంది కావున వీటిని అరికట్టాలన్నారు. దోమకాటు నుంచి ప్రజలు రక్షణ పొందటానికి అవగాహన అవసరమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో వై.రాజ్‌కుమార్, ఎస్‌కే షకీల్, జె.రాంబాబు, శరత్‌బాబు, ఎస్‌కే కదీర్, బి.మరియమ్మ, ఆర్.అరుణ, నాగార్జున రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు, నర్సింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరాన్ని బట్టి సర్వీస్‌లు పెంచుతాం

● ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచ్చెర్ల ఆదాం సాహెబ్

బాపట్ల, ఏప్రిల్ 25 : అవసరాన్ని బట్టి ఆర్టీసీ సర్వీస్‌లు పెంచుతామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచ్చెర్ల ఆదాం సాహెబ్ తెలిపారు. బాపట్ల ఆర్టీసీ డిపో, గ్యారేజిలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. డిపో పరిధిలోని వాహనాల పరిస్థితి, నిర్వహణ, ఆయిల్ వినియోగం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రీజనల్ మేనేజర్ వై.విజయ్‌కుమార్‌రెడ్డి, డిపో మేనేజర్ టి.శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల ఆర్టీసి డిపో పరిధిలో 36 సర్వీస్‌లతోపాటు 8 హయ్యర్ బస్సులు ఉన్నాయన్నారు. రూట్ యావరేజి ప్రకారం కొత్త వాహనాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. జోన్ పరిధిలోని 25 ఆర్టీసీ డిపోలకు కొత్తగా 500 సర్వీస్‌ల కొరకు ప్రతిపాదనలు చేయటం జరిగిందన్నారు. అదనంగా రూట్ శాంక్షన్ అయితే కొత్త బస్సులు వస్తాయన్నారు. సిద్ధం సభలకు అడ్వాన్స్ చెల్లించిన తర్వాత మాత్రమే బస్సులను పంపించటం జరిగిందన్నారు. బాపట్ల రీజనల్ పరిధిలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి ఆర్టీసీ డిపోల పరిధిలో 95 శాతం టార్గెట్ సాధించినట్లు తెలిపారు. ఆయా డిపోల మేనేజర్లతో ఈ విషయమై సమీక్షించారు.

విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి చదువులు దోహదపడాలి

● టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి

బాపట్ల, ఏప్రిల్ 25 : విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి చదువులు దోహదపడాలని టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని రైలుపేట బెస్ట్ చైల్డ్ స్కూల్ 10వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వడ్లమూడి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం, నాయకులు

కార్యక్రమానికి వడ్లమూడి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మార్కులు, ర్యాంకల ప్రాధాన్యత తగ్గించి చదువులు అర్థవంతంగా ఉండేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమానికి ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, చైతన్య కళాశాలల ప్రిన్సిపాల్స్ వేణుగోపాల్, మోహనరావులు పాల్గొని విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వడ్లమూడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరీద్‌మస్తాన్, తాతా చినబాబు, బూర్లె రామసుబ్బారావు, షాకా, బోధన,బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేఅభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు హారతులు పడుతున్న మహిళలు



రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

మహిళలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ పథకాలు

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



నరేంద్రవర్మకు జేజేలు పలుకుతున్న మహిళలు

పిట్టలవానిపాలెం ఏప్రిల్ 25 : మహిళలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ పథకాలు ఎంతగానో దోహదపడతాయని, రానున్నదని కూటమి ప్రభుత్వమేనని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం పంచాయతీలోని కప్పలవారిపాలెం, గడ్డంవారిపాలెం, ఖాజీపాలెం, నాయీబ్రాహ్మణ కాలనీ, రామ్‌నగర్ (ఎటికట్ట), పోతనకట్టవారిపాలెం గ్రామపంచాయతీలోని పుచ్చకుర్తివారిపాలెం, పోతనకట్టవారిపాలెం తదితర గ్రామాలలో గురువారం నరేంద్రవర్మ కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామగ్రామాన మహిళలు హారతులు పట్టి పసుపుజెండాలతో జేజేలు పలికారు. అడుగడుగున జనస్పందన చూసి నరేంద్రవర్మ వారికి సూపర్‌సిక్స్ కరపత్రాలు అందజేసి అధికారంలోకి వస్తే కూటమి చేపట్టే కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చూస్తానన్నారు. డ్రైనేజి వ్యవస్థను ప్రక్షాళన చేసి సాగునీటి కాల్వలు పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. వీధిదీపాలు, దోమల నివారణ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి తెలుసుకున్న నరేంద్రవర్మ తీవ్రంగా స్పందించి వచ్చేది ప్రజాప్రభుత్వమని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తారని తెలిపారు. సమస్యలు లేని గ్రామాలు, పట్టణాభివృద్ధి సాధించటమే సంకీర్ణకూటమి ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అవ్వాతాతలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని వేగేశన నరేంద్రవర్మ కోరారు. మండల, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవి కృష్ణమూర్తిరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు దుండు శ్రీనివాసరాజు, ఖాజీపాలెం యువనాయకులు కొత్తపల్లి పృధ్వీరాజ్, ఖాజీపాలెం గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీటీసీ కొనికి సాంబయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకర్‌రెడ్డి, సీనియర్ టీడీపీనాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కలకోట కిషోర్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, చందోలు యువనాయకులు సయ్యద్ నిజాం, ఎంఎస్ నియాజీ, దరియా, సలీం, వేగేశన రామకృష్ణంరాజు, ఆయాగ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి తెలుగుదేశంకే సాధ్యం

● మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఏప్రిల్ 25 : ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే చంద్రబాబునాయుడును మళ్లీ గెలిపించుకుందామని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెం, జిలుగువారిపాలెం, అక్కివారిపాలెం, గుత్తావారిపాలెం, గాజులపేట, కోళ్ళపాలెం, పెదపులివర్రు గ్రామాల్లో గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో దారిపొడవునా మహిళలు, యువకులు పూల దండలు వేస్తూ, పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న కాలంలో పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కోట్లాది రూపాయిలు ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నారు. పెదపాలెం, కోళ్ళపాలెం, అక్కివారిపాలెం, జిలుగువారిపాలెం, పెదపులివర్రు తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు, కమ్యూనిటీ భవనాలు నిర్మించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయండి మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలకు ఆనందబాబు హామీనిచ్చారు. కూటమిపై వైసీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని ప్రజలు తిప్పికొట్టాలని జగన్‌రెడ్డి రాష్ట్రం వదిలిపారిపోయేలా ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కోడి కత్తి డ్రామా, వివేకానందరెడ్డి హత్యలు ఎవరు చేయించారో ప్రజలకు అర్థమైపోయిందని మరలా సానుభూతితో గెలిచేందుకు గులకరాయి డ్రామాకు తెరలేపి అమాయకులైన వడ్డెర యువకులను బలి చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, నాయకులు క్లస్టర్ ఛైర్మన్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు, మండల కన్వీనర్ వాకా శేషు, నాయకులు నూతక్కి దినకర్‌బాబు, జంపని వీరయ్య, నక్కా శ్రీనివాసరావు, విజయ్, కోటేశ్వరరావు, సుబ్బారావు, సంసోను, సతీష్‌బాబు, తల్లపనేని నాని, మురళి, నీలా జోజిబాబు, గద్దె యతీష్ పాల్గొన్నారు.



పెదపాలెంలో ప్రచారం రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనందబాబు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 25 కుటుంబాలు

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు మరింతగా కొనసాగుతున్నాయి. మండలంలోని పెదపులివర్రు గ్రామానికి 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ప్రచారంలో భాగంగా గురువారం పెదపులివర్రులో ప్రచారం నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన మల్లిపెద్ది విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలు టీడీపీలో చేరగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళలకు రక్షణ, మహిళా చైతన్యం చంద్రబాబునాయుడు ద్వారానే సాధ్యపడుతుందని నమ్మి టీడీపీలో చేరుతున్నట్లు ఆయా కుటుంబాల మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదపులివర్రులో ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు



పెదపులివర్రులో ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మహిళలు

జగన్ పాలనలో విసిగిపోయిన ప్రజలు

● చంద్రబాబు నాయకత్వం కోసం ప్రజల ఎదురుచూపు

● ఎన్డీయే కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

రేపల్లె, ఏప్రిల్ 25: ఐదేళ్ళ జగన్ పాలనలో విసుగుపోయిన ప్రజలు చంద్రబాబునాయుడు పాలన కోసం ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం రేపల్లె మండలం ఊలుపాలెం, నల్లూరుపాలెం, తుమ్మల, పోటుమెరక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లూరుపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యే అనగానిపై పూలవర్షం కురిపించి భారీ సం దోహం మధ్య స్వాగతం పలికారు. గజమాల వేసి అడుగడుగున మహిళలు హారతులు ఇస్తూ దిష్టి తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించారని, యువతకు ఉద్యోగ కల్పనలో విఫలం చెందారని, రాష్ట్రాన్ని గంజాయి, మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. దీని కారణంగా రాష్ట్రంలో వేలాది మంది యువత నిరుత్సాహులై కొంతమంది వాటికి బానిసై మృతి చెందారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీనిచ్చారు. జగన్ ఐదేళ్ళ పాలనలో ఆంధ్ర రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, మహిళలపై దాడులు, హత్యా రాజకీయాలకు ప్రోత్సహించారే తప్పా రాష్ట్రంలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. వైసీపీ ఓటు వేస్తే విధ్వంసానికి ఓటు వేసినట్లేనన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, రేపల్లె రామాంజనేయులు, రేపల్లె సురేష్, రావిపాటి శ్రీధర్, రామారావు, రావిపాటి గోవింద మ్మ, రాజేశ్వరరావు, యలవర్తిలక్ష్మీ, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, పంతాని సాయికుమార్, గోరికపూడి నాంచారమ్మ, సబ్బినేని సాంబశివరావు, వీరవల్లి రాజేంద్ర, పులివర్తి జోజి, కారుమూరు మురళి, తుమ్మల శ్యామ్‌బాబు, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె జానకిరామయ్య, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భారీ గజమాలతో ఎమ్మెల్యే అనగానిని సన్మానిస్తున్న నల్లూరుపాలెం వాసులు



నల్లూరుపాలెంలో ఎమ్మెల్యే అనగానికి దిష్టి తీస్తున్న మహిళలు



తుమ్మల గ్రామంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనగాని

టీడీపీ పాలనలో చర్చిల అభివృద్ధికి రూ.2 కోట్లు ఖర్చు చేశాం

● ఆలోచించి ఓటు వేయండి అండగా ఉంటా

● మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఏప్రిల్ 25 : టీడీపీ పాలనలో నియోజకవర్గంలో చర్చిల అభివృద్ధికి రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ కూడి క గురువారం భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలో నిర్వహించా రు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనందబాబు మాట్లాడుతూ దేవుడి దయ ప్రజల ఆశీస్సులతో రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేశానన్నారు. నాపై పోటీ చేసి గెలుపొందిన వ్యక్తి చేసిన అభివృద్ధి ఏమీ లేక మరో నియోజకవర్గానికి పారిపోయారన్నారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని ఎల్లప్పుడూ ప్రజల తో మమేకమై ప్రజల పక్షాన నిలిచి ఉండే వ్యక్తిని ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎక్కడ నుంచో ఇక్కడకు వచ్చిన వైసీపీ ఇన్‌ఛార్జ్ తనపై అవాకులు చవాకులు పేలుతున్నాడు నాపై మాట్లాడే అర్హ త అతడికి లేదన్నారు. అధికారం, పదవులు శాశ్వతం కాదని నమ్మే వ్యక్తినని అవకాశం వచ్చినప్పుడు ప్రజలకు చేసిన మేలు, చేసిన అభివృద్ధి చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అదేవిధంగా పని చేశానని ఆయన స్పష్టం చేశారు. చదువుకునే రోజుల నుంచి చర్చిలు, పాస్టర్లపై ఒక అవగాహన ఉందని అధికారంలో వచ్చిన వెంటనే పాస్టర్లకు అండగా నిలుస్తానని ఒక్కసారి అవకా శం కల్పించి ఆదరించాలని ఆనందబాబు కోరారు. వివిధ గ్రామా ల నుంచి వచ్చిన సంఘ కాపరులు రాబోయే ఎన్నికల్లో నక్కా ఆనందబాబు విజయం సాధించాలని ప్రార్థనలు చేశారు. దైవ సేవకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో బిషప్ కత్తెర సురేష్‌కుమార్ పాస్టర్లు పాల్గొన్నారు.



ప్రార్థనలలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, సురేష్‌కుమార్ తదితరులు

ఎమ్మెల్యే అభ్యర్థులుగా 19 మంది నామినేషన్లు

బాపట్ల, ఏప్రిల్ 25 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా గురువారం 19 మంది నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా గంటా అంజిబాబు, గంటా నవీన్‌లు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కట్టా కోర్నేలియా, పిల్లిశేఖర్, ఊసా తులసీరావు, వడ్డిముక్కల డేవిడ్, దెందుకూరి సీతారామరాజు, పఠాన్ మహబూబ్‌ఖాన్, బేతాళం యశ్వంత్, సలగల రాజా, పద్మభూషణ శర్మ, వివి కస్తూరియా, కొచ్చెర వినయ్‌రాజు, కటికల శివభాగ్యారావు నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరుపున వేగేశన నరేంద్రవర్మరాజు, వేగేశన హరికుమారి, తెలుగు విజయం పార్టీ తరుపున బెజ్జం మల్లికార్జునరావు, జయమహాభారత్ పార్టీ తరుపున అక్కల రాంబాబురెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి పిట్టు బూసిరెడ్డి మాత్రం రెండుసెట్‌లు నామినేషన్లు వేశారు.

బాపట్ల పార్లమెంట్‌కు 17నామినేషన్లు

బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి 17 మంది ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ రాజకీయపార్టీలు నుంచి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్‌ల ప్రకియను ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ్‌సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌వో సి.హెచ్ సత్తిబాబు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

రేపల్లెలో 14 నామినేషన్లు...

రేపల్లె, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం 14నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ తరపున అనగాని సత్యప్రసాద్ రెండు నామినేషన్లు ఇండియన్ యూనియన్‌ముస్లీం లీగ్ పార్టీ తరపున షేక్ హస్సీనా రెండు నామినేషన్లు, బహుజన సమాజ్‌పార్టీ తరపున డొక్కా శ్రీనివాసరావు ఒక నామినేషన్, జాతీయ జనసేన పార్టీ తరపున యడ్ల గోపీరాజ్ ఒక నామినేషన్, భారత చైతన్య యువజన పార్టీ తరపున అంగిరేకుల ఆదినారాయణ ఒక్కటి, ఇండిపెండింట్ అభ్యర్థిగా మహ్మద్ కాశీ ఒక్కటి, ఇండియన్‌నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున మోపిదేవి రాఘభవనేష్ ఒక నామినేషన్, వైసీపీ నుంచి ఈవూరి సృజన్ రెండు నామినేషన్‌లు, ఇండియన్ ప్రజాబంధు పార్టీ తరపున మేరుగపాళ్ళ సదాశివరావు ఒక నామినేషన్‌ను దాఖలు చేశార న్నారు. 18 నుంచి 25వ తేదీ వరకు వచ్చిన నామినేషన్లు వివిధ పార్టీల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా దాఖలు చేసిన నామినేషన్లు మొత్తం 35 దాఖలయ్యాయని తెలిపారు.

24 నామినేషన్లు దాఖలు

వేమూరు, ఏప్రిల్ 25 : వేమూరు అసెంబ్లీ స్థానానికి మొత్తం 24 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. గురువారం 9 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి చెప్పారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశం

కొల్లూరు, ఏప్రిల్ 25: టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తు న్నట్లు మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు హాజరు కానున్న ట్లు చెప్పారు మండలంలోని బూత్, యూనిట్, క్లష్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల, గ్రామ పార్టీ నాయకులతో పాటు జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహం పై కూటమి అభ్యర్థి ఆనందబాబు దిశా నిర్దేశం చేయనున్నట్లు మైనేని తెలిపారు.

● ఎన్నికల రహదారా..
● పట్టించుకోని అధికారులు

రోడ్డుపై మళ్లీ రోడ్డు !

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25: ఎన్నికల వేళ అధికార రాజకీయ పార్టీలలో ఓట్ల గుబులు మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నాళ్ల నుంచో అడుగుతున్న పనులకు ఇప్పుడు మోక్షం కలుగుతుంది. పిడుగురాళ్లలోని మొండిగేటుకు వెళ్లే రహదారి గతుకుల మయమైందని, సిమెంట్ రోడ్డు వేయాలంటూ ఆ వీధిలోని వారు పలుమార్లు అధికారులను అడిగినప్పటికీ నిధుల కొరతతో పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం ఇప్పుడు రహదారిపై వున్న గతుకులను పూడ్చాల్సింది పోయి ఏకంగా రోడ్డుపైనే గురువారం రోడ్డు వేశారు. రోడ్డు వేసింది అధికారులా... రాజకీయ నాయకులా.. అనేది తేలాల్సి వుంది. ఏది ఏమైనప్పటికీ ఓట్ల కోసం అధికార పార్టీ చేస్తున్న కొన్నింటికి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నారు.


మొండిగేటు వైపు వెళ్లే రహదారికి సిమెంట్ వేయకముందు ఇలా...


మొండిగేటు వైపు వెళ్లే రహదారిపై వేసిన రోడ్డుపై మళ్లీ సిమెంట్ వేసిన తరువాత ఇలా..

జిల్లాలో 342 నామినేషన్లు

● లోక్‌సభకు 40.. అసెంబ్లీలకు 302 దాఖలు
● ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ ప్రక్రియ

నరసరావుపేట, ఏప్రిల్ 25: జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చివరిరోజు గురువారం 89 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల ర్యాలీలతో నామినేషన్ల ఘట్టం కోలాహలంగా జరిగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. నామినేషన్ల స్క్రూటినీ శుక్రవారం నిర్వహించనున్నారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి 27 మంది అభ్యర్థులు 40 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 176 మంది అభ్యర్థులు 302 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. చిలకలూరిపేటలో అత్యధికంగా 33 మంది, సత్తెనపల్లిలో అతి తక్కువగా 22 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

నియోజకవర్గాల వారీగా నామినేషన్‌ల వివరాలు..

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	నామినేషన్‌లు
నరసరావుపేట లోక్‌సభ	27	40
నరసరావుపేట అసెంబ్లీ	25	48
పెదకూరపాడు	26	51
చిలకలూరిపేట	33	49
సత్తెనపల్లి	22	38
వినుకొండ	24	39
గురజాల	25	37
మాచర్ల	24	40

కోడ్ ఉన్నా..
యధేచ్ఛగా దాడులు

● పెట్రేగిపోతున్న వైసీపీ మూకలు
● మారని అధికారుల తీరు.. ఆగని అరాచకాలు
● స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే దాడులకు యత్నం
● టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్న వైసీపీ
● ప్రశాంత, స్వేచ్ఛాయుత ఎన్నికలపై ఓటర్లలో సన్నగిల్లుతున్న నమ్మకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పిస్తున్నాం. ఏ నిమిషంలో ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం.. అని కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్ గత కొన్ని రోజులుగా ప్రకటిస్తున్నారు.. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా గత కొన్ని రోజులుగా వరుసగా జరుగుతున్న అరాచక సంఘటనలను చూసిన వారు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోగలమా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి బదిలీతో అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు, ఇతర ఎన్నికల అధికారులు వెనక్కి తగ్గుతారని అందరూ భావించారు. అయితే మా ధోరణి మాదే అన్నట్లుగా ఇంకా కొందరు పోలీసు అధికారులు ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ శ్రేణులు తగ్గేదేలే అన్న రీతిలో అరాచకాలకు పాల్పడుతూనే ఉన్నాయి. తమ మాట వినని వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీటికి హద్దే లేకుండా పోయింది. వైసీపీ మూకలు పేట్రేగిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇదే అవకాశంగా టీడీపీ సానుభూతి పరులను టార్గెట్ చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రశాంత ఎన్నికలపై ఓటర్లలో నమ్మకం సన్నగిల్లుతోంది. ఎస్పీ బిందు మాధవ్ జిల్లాలో ప్రశాంత ఎన్నికల కోసం విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నా అదే స్థాయిలో కింది స్థాయి అధికారులు వ్యవహరించడంలేదన్న విమర్శలున్నాయి.

ప్రజల్లో భయాందోళనలు

జిల్లాలో వరుసగా జరుగుతున్న దాడులతో సామాన్య ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గం నుంచి ఇతర నియోజకవర్గాలకు అరాచకాలు ప్రబలుతున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో కూడా పలు సంఘటలు చోటుచేసుకున్నాయి. ఫిర్యాదు ఇస్తే ఐదే ఐదు నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా ఆచరణలో అది కనిపించడంలేదు. దాడులు పథకం ప్రకారం జరగడంలేదని, అప్పటికప్పుడు చోటు చేసుకుంటున్నాయని అధికారులు ప్రకటించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జరిగిన అరాచకాలను పరిశీలిస్తే క్షణికావేశంలో జరిగినట్లుగా కానరావడంలేదు. పథకం ప్రకారమే టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడుల జరుగుతున్నట్లు అర్థమవుతుంది. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీ వర్గీయులపై ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే పోలీసుల సమక్షంలో వైసీపీ మూకలు దాడి చేశాయంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వారికి పోలీసులు అండ ఎంత ఉందో అర్థమవుతుంది. మాచర్ల, గురజాల, పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈ వారం పది రోజుల్లో దాదాపు 20కి పైగా సంఘటనలు జరిగాయి. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు చూస్తే..

- దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన టీడీపీ కార్యకర్త యూసఫ్‌పై పోలీసుల సమక్షంలో దాడి జరిగింది.
- ఈపూరు మండలం ఇనుమెళ్లలో టీడీపీ సానుభూతిపరుల ఇళ్లపై వైసీపీ మూకలు రాళ్లతో దాడిచేసి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచాయి. టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి వచ్చిన అనంతరం వైసీపీ మూకలు ఈ దాడికి తెగబడ్డాయి.
- నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో టీడీపీ అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల ప్రచారాన్ని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ప్రచార వాహనం వద్ద కర్రలతో హల్‌చల్ చేస్తూ దాడికి యత్నించాయి. ఈ సంఘటన పోలీసుల సమక్షంలోనే జరగడం గమనార్హం.
- బెల్లంకొండ మండలంలో టీడీపీ కార్యాలయాన్ని అగంతకులు దహనం చేశారు. ఇది వైసీపీ వారి పనేనని టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ కళాజాత ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. వాహనానికున్న ఫ్లెక్సీలను చించివేసి కళాకారులపై దాడిచేసి గాయపరిచారు.


బెల్లంకొండలో వైసీపీ మూకలు దగ్ధం చేసిన టీడీపీ కార్యాలయం (ఫైల్)


నరసరావుపేట: ఉప్పలపాడులో ఇటీవల టీడీపీ అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్న వైసీపీ మూకలు


దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లోనే టీడీపీ కార్యకర్త తండా యూసుఫ్‌ను గాయపర్చిన పొందుగలకు చెందిన వైసీపీ మూకలు (ఫైల్)




పెదకూరపాడు: టీడీపీ ప్రచార వాహనం ఫ్లెక్సీలను చించిన వైసీపీ మూకలు, వారి దాడిలో గాయపడిన కళాకారులు(ఫైల్)


ఈపూరు మండలం ఇనిమెళ్లలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులు



రాజకీయాలకు.. పాఠశాల

● నిడుబ్రోలులో తొలిసారిగా ఏర్పాటు
● మహాత్మా గాంధీ చేతుల మీదుగా ప్రారంభం
● ముఖ్యమంత్రులు, మంత్రులును అందించిన పాఠశాల

పొన్నూరుటౌన్, ఏప్రిల్25: గ్రామీణ ప్రాంత ప్రజలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశంతో నిడుబ్రోలులో రామనీడు రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేశారు. రాజకీయ దురంధరుడిగా పేరుగాంచిన ఆచార్య ఎన్జీరంగా 1932లో గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని నిడుబ్రోలులో రామనీడు గ్రామీణ రైంతాంగ విద్యాలయాన్ని మహాత్మగాంధీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ పాఠశాలలో ఎందరికో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ఈ పాఠశాలకు దేశం నలుమూలల నుంచి ఉత్తములను ఎంపిక చేసి వారిని రాజకీయ పాఠాలు నేర్పించేందుకు నియమించారు. 1932లో స్వామి సీతరామ్‌ను చూసేందుకు కావూరు వినయాశ్రమానికి వచ్చిన మహాత్మగాంధీ చేత ఈ పాఠశాలను ప్రారంభించారు. పల్లె వాసులు కూడా రాజకీయ ఆర్థిక, కార్మిక వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో ఎదిగేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దారు. అలాగే స్వతంత్ర ఉద్యమంలో పల్లెవాసులకు ప్రాతినిధ్య వహించేలా ఈ పాఠశాల తర్ఫీదు ఇచ్చేది. అయితే ఈ పాఠశాల రాజకీయ పాఠశాలగా కాలక్రమంలో రూపాంతం చెంది దేశానికి ముఖ్యమంత్రులను, మంత్రులను అందచేసింది. ఆచార్య ఎన్జీ రంగా శిష్యులుగా పేరొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య, ఆర్ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడ గోపాల్‌రెడ్డి, భవనం వెంకట రామిరెడ్డి తదితరులు ఈ పాఠశాలలోనే రాజకీయ ఓనమాలు దిద్ది ముఖ్యమంత్రులుగా పరిపాలించారు. అలాగే సర్దార్ గౌతులచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయ్యర్‌దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరందామయ్య, అవుతు రామిరెడ్డి తదితరులు మంత్రులుగాను, ఎంపీలు, ఎమ్మెలుగా పనిచేశారు. ఈ పాఠశాల కాలక్రమంలో శిథిలం కావటంతో పూర్తి తొలగించారు.


రామనీడు రాజకీయ పాఠశాల (ఫైల్)

వైసీపీ నామినేషన్.. పోలీసుల ఓవరాక్షన్

వేమూరు, ఏప్రిల్ 25: వైసీపీ నామినేషన్ కార్యక్రమంలో ట్రాఫిక్ పేరుతో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. ఫలితంగా తెనాలి-కొల్లూరు మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. టీడీపీ ప్రచార వాహనాలను సైతం పక్కన పెట్టించేశారు. గురువారం వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్ కోసం కొల్లూరు నుంచి వేమూరుకు ర్యాలీ ఏర్పాటు చేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు నిషేధించారు. జంపని గ్రామం నుంచి పోతుమర్రు మీదుగా వాహనాలు మళ్ళించడంతో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భట్టిప్రోలు చేరేందుకు వాహనదారులు తంటాలు పడాల్సి వచ్చింది. భారీ వాహనాలు ఈ మార్గంలో వెళ్ళే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు చిన్నవి కావడంతో నామినేషన్లు అయ్యేవరకు రహదారులపైనే నిలిపి ఉంచారు. ఆర్టీసీ బస్సులను కూడా అనుమతించక పోవడంతో ప్రయాణికులు గొడవ చేశారు. దీంతో బస్సులను అనుమతించడంతో అవి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోగా మూడు గంటల పాటు వాహనదారులు, ప్రయాణికులు ఎండ దెబ్బకు తాళలేక ఇక్కట్ల పాలయ్యారు.


జంపని చెరువు వద్ద వైసీపీ వాహనాలను స్వేచ్ఛగా పంపుతున్న పోలీసులు


టీడీపీ ప్రచార వాహనాన్ని నిలిపివేసిన దృశ్యం

చట్టసభల్లో..
నారీభేరి

● కేంద్ర మంత్రులుగా ఇద్దరు.. రాష్ట్ర మంత్రులుగా ఐదుగురు
● హ్యాట్రిక్ సాధించిన ఇద్దరు
● పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జనాభా.. ఓటర్లలోనూ వారే అధికం. చట్టసభల్లో ప్రాతినిధ్యానికి వచ్చేసరికి చాలా తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. మహిళలకు ప్రధానంగా ఆయా రాజకీయపక్షాలు అవకాశాలు కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా, ఐదుగురు రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. ఇద్దరు తమ నియోజకవర్గాల్లో హ్యాట్రిక్ సాధించారు. అవకాశాలు కల్పిస్తే దూసుకు పోతామని రుజువు చేస్తున్నారు. అయినా కొన్ని పార్టీలు వారికి సముచిత స్థానం కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

జిల్లా నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్ర మంత్రులుగా దగ్గుబాటి పురంధేశ్వరి, పనబాక లక్ష్మి బాధ్యతలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరి 2004లో బాపట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆమె యూపీఏ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా పనిచేశారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో బాపట్ల లోక్‌సభ స్థానం ఎస్సీలకు కేటాయించారు. దీనితో పురంధేశ్వరి 2009లో విశాఖపట్నానికి మారారు. నెల్లూరు జిల్లాకు చెందిన పనబాక లక్ష్మి 2009లో బాపట్ల నుంచి లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆమె 2009-14లో కేంద్రమంత్రిగా పనిచేశారు. విభజన తరువాత 2014లో ఆమె ఇక్కడ ఓడిపోయారు. కాగా సినీనటి ఊర్వశి శారద తెనాలి నుంచి లోక్‌సభకు 1996లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 1998లో అక్కడే ఓడిపోయారు. తరువాత 1999లో నెల్లూరు జిల్లా వెంకటగిరి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తరువాత కాంగ్రెస్‌లో చేరారు.

రాష్ట్ర మంత్రులుగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాకు చెందిన నలుగురు మహిళలు అసెంబ్లీకి ఎన్నికై మంత్రులుగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం మరొకరు శాసనసభకు ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భవనం జయప్రద, నన్నపనేని రాజకుమారి, ఈపూరి సీతారావమ్మ, డాక్టర్ శనక్కాయల అరుణలు మంత్రులుగా పని చేశారు. న్యాయవాది భవనం జయప్రద వినుకొండ నుంచి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

- మాజీ సీఎం దివంగత భవనం వెంకట్రామ్ సతీమణి జయప్రద ఆయన కంటే ముందు నుంచే రాజకీయాల్లో ఉన్నారు. 1967-78లో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. అప్పట్లోనే రాష్ట్రమంత్రిగా పనిచేశారు. కోస్తా జిల్లాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.
- తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి 1983లో సత్తెనపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా, 1989లో వినుకొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాదెండ్ల క్యాబినెట్‌లో నెలరోజుల మంత్రిగా పనిచేశారు. వినుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసెంబ్లీ చీఫ్‌విప్‌గా కొనసాగారు. 1994లో వినుకొండ నుంచి ఓడిపోయారు. తరువాత టీడీపీలో చేరారు. నన్నపనేని ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. విభజన తరువాత నవ్యాంధ్ర మహిళా కమిషన్ తొలి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు.
- 2009 నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఉన్న కూచినపూడి నుంచి ఈపూరి సీతారావమ్మ వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1985, 1989, 1994లో అసెంబ్లీకి కూచినపూడి నుంచి గెలుపొందారు. 1999లో ఓడిపోయారు. 1995-99లో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఓడిపోయిన తరువాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- గుంటూరు నగరానికి చెందిన వైద్యురాలు శనక్కాయల అరుణ 1999లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థిగా గుంటూరు-2 నుంచి గెలుపొందిన డాక్టర్ అరుణ చంద్రబాబు క్యాబినెట్‌లో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా సుమారు రెండేళ్ల కొనసాగారు.
- పల్నాడులో మాచర్ల నుంచి 1999లో జూలకంటి దుర్గాంబ టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పల్నాడు నుంచి చట్టసభలకు ఎన్నికైన తొలి మహిళగా దుర్గాంబ రికార్డు సృష్టించారు.
- చిలకలూరిపేటలో రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ కందిమళ్ల జయమ్మ 1989లో టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో ఆమెకు టికెట్ రాలేదు. 1995లో చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్‌గా జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- గుంటూరుకు చెందిన జైమున్నీసా బేగం 1972లో పెదకూరపాడు నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని ఒక వర్గం జైమున్నీసా బేగాన్ని రంగంలోకి దింపి గెలిపించారు. తరువాత ఆమె రాజకీయాలకు దూరమయ్యారు.
- చేనేతలు ఎక్కువగా ఉన్న మంగళగిరిలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాండ్రు కమల అసెంబ్లీకి ఎన్నికయ్యారు. విభజన తరువాత 2014లో ఆమె పోటీ చేయలేదు. 2000లో మంగళగిరి మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.
- తెనాలి నుంచి దివంగత దొడ్డపనేని ఇందిర ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీకి హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1967, 1972, 1978లో వరుసగా మూడుసార్లు తెనాలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1983, 1985లో ఓడిపోయారు. ఆమె తండ్రి దివంగత ఆలపాటి వెంకటరామయ్య తెనాలి నుంచి గెలుపొంది రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.
- తెలుగుదేశం పార్టీ 1999లో తెనాలిలో డాక్టర్ గోగినేని ఉమను బరిలోకి దింపారు. ఆ ఎన్నికల్లో డాక్టర్ ఉమ కాకలు తీరిన కాంగ్రెస్ నేత రోశయ్యను ఓడించారు. 2004లో డాక్టర్ ఉమ ఓడిపోయారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009లో టీడీపీ ఆమెకు టికెట్ ఇవ్వలేదు. ఉమ తల్లి ఇందిర, తాత వెంకటరామయ్యలు కూడా తెనాలి నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.
- ప్రత్తిపాడు నుంచి మేకతోటి సుచరిత 2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ మృతి తరువాత సుచరిత జగన్‌వైపు మొగ్గారు. అసెంబ్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో పదవి కోల్పోయారు. తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. 2019లో తిరిగి గెలుపొందారు. ఈ దఫా నియోజకవర్గం మారి తాడికొండ నుంచి పోటీ చేస్తున్నారు. చిలకలూరిపేట నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన విడదల రజని జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ విధంగా జిల్లాలో పలువురు మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారు.



వైసీపీని వీడి టీడీపీలోకి

- ఏలూరికి మద్దతు తెలుపుతున్న నేతలు
- అందరం కలిసి అభివృద్ధిని పునఃప్రారంభిద్దాం
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సాంబశివరావు

పర్చూరు, ఏప్రిల్ 25: రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు తెలుపుతున్నారు. ప్రతిరోజూ వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిల్ ఎక్కుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. గత రెండు నెలల నుంచి పార్టీలోకి వలసల జోరుగా సాగుతున్నాయి. పార్టీలకు అతీతంగా ఏలూరి చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, అందరికీ అందుబాటులో ఉంటున్న తీరుకు ప్రజా మద్దతు పెరుగుతోంది. గురువారం మార్టూరు మండలం ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో మార్టూరు, పెద్దగంజాం, ఉప్పుటూరు, గర్నెపూడి, కోనంకి గ్రామాల నుంచి వందలాది మంది తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రపుఃనిర్మాణం, భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ టీడీపీలో కలసి రావాలని కోరారు. వైసీపీ అరాచక విధ్వంస పాలనను సాగనంపేందుకు ప్రజా కూటమి ఏర్పాటు అయ్యిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

పెదగంజాంలో..

పెద్దగంజాంకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారిలో భీమవరపు సుందరంకొండ, ఆముదాలపల్లి శివ, భీమవరపు రాములు, ఆముదాలపల్లి గోపి, భీమవరపు శ్రీను, మార్పూరి రామచంద్ర, ఆముదాలపల్లి అంకమ్మరావు, శ్రీనివాసరావు, మురళీ, కోటయ్య, వెంకటేష్, నూటక్కి కోటేశ్వరరావు ఉన్నారు.

ఉప్పుటూరులో..

పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాలేటి శివనాగేశ్వరావు, షేక్.కరిముల్లా, ఉరుమ కుమార వీరభద్రరావు, కొమ్మనబోయిన కోటయ్య షేక్ ఖాశింబుడే ఉన్నారు.

మార్టూరులో..

మార్టూరుకు చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉయ్యాల ఆంజనేయులు, పాలపర్తి రత్తయ్య, పాలపర్తి నాగరాజు, కోటేశ్వరరావు, ఆలపర్తి వీరబ్రహ్మం, ఉయ్యాల నరేంద్ర, పేరం అనిల్ పార్టీలో చేరారు. తూర్పు బజార్‌కు చెందిన దగ్గుబాటి సుధాకర్, సురేష్, మక్కెన రమణ, కోటి శ్రీనివాసరావు, దాశి రక్షణ పార్టీలో చేరారు. కోనంకికి చెందిన పఠాన్ నాగూర్ వలి పార్టీలోకి చేరారు.

గర్నెపూడిలో..

పర్చూరు మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ ఖాశింబుడే, పఠాన్ నాగూర్ మీర్జా, షేక్ నాగూర్ వలి, పఠాన్ సుభానీ, కొరిటాల ఈశ్వర్‌చంద్ర, పార్టీలోకి చేరారు.



చెరుకూరులో ప్రచారంలో పాల్గొన్న మహిళలు

పర్చూరులో దూసుకుపోతున్న టీడీపీ ప్రచారం

- వాడవాడలా టీడీపీకి బ్రహ్మరథం

సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ ప్రజా కూటమి చేపడుతున్న ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతూ అడుగడునా స్వాగతం తెలవుతున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం కోసం పెద్ద సంఖ్యలో మహిళలు యువకులు, వృద్ధులు సైతం తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీకి చెందిన శ్రేణులు టీడీపీలో చేరుతున్నారు. గురువారం మండలంలోని చెరుకూరు గ్రామంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి ఉషారాణి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించి చంద్రన్న సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

కారంచేడులో..

కారంచేడు గ్రామ పార్టీ అధ్వర్యంలో గురువారం ఎన్నిలక ప్రచారం నిర్వహించారు. ఈప్రచారానికి పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, యువకలు తరలివచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంకొల్లులో కూటమి శ్రేణుల ప్రచారం



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పుటూరు వైసీపీ నాయకులు

ఇంకొల్లు : టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చే యాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృత ప్రచారాన్ని చేశారు. గు రువారం ఇంకొల్లు స్టాలిన్‌పేటలో జరిగిన ప్రచారంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్, యడ్లూరి ప్రసాద్, కొల్లూరి రాంబాబు, శివాజీ, మండల మహి ళా నాయకురాలు బిందుమాధవి, మండల ప్రచార కార్యదర్శి అనంతలక్ష్మి, శివయ్య, రాజేష్, సాంబయ్య, మీరావలి, భాస్కర్, నాని పాల్గొన్నారు.

వైసీపీ పాలన అంతం

చినగంజాం : వైసీపీ పాలన అంతమై.. టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన రాబోతుందని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ సీనియర్ నాయకులు టీ.జయరావులు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్యకాలని, రామకోటేశ్వర, మహాలక్ష్మికాలనీల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ .. భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రా లను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, సందు శ్రీనివాసరావు మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.పద్మావతి, చేవూరి రవణమ్మ, గంటా చెన్నయ్య పీ.శ్రీనివాసరావు, సుభాని, మహబూబ్‌ఖాన్, జి.వెంకటనారాయణ, అమీర్జాన్, ఎస్.సూరిబాబు, మహేష్, మురళి పాల్గొన్నారు.



రామకోటేశ్వర కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మలేరియాపై అవగాహన ర్యాలీ

యద్దనపూడి (మార్టూరు), ఏప్రిల్ 25 : మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా గురువారం యద్దనపూడి గ్రామంలో ప్రభుత్వ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్రారంభించిన గ్రామంలోని ప్రధాన సెంటరు వరకు ర్యాలీ చేశారు. ఈ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ పీ శ్రీహర్ష, సీహెచ్‌వో ప్రసాద్ ఎస్‌యూవో శేషగిరిరావు, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సునందరారాజు, ఎంఎల్ పీహెచ్‌వోలు, ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

చినగంజాం, ఏప్రిల్ 25 : మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు పీ.సాయిశ్రీచరణ్, కే.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది గ్రామంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. గ్రామవాసులు తమ ఇళ్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని వైద్యాధికారులు సూచించారు. దోమ కాటు వలన కలిగే వ్యాధుల గురించి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి గ్రామస్థులకు వివరించారు. ర్యాలీలో దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పీ.శ్రీనివాసరావు, హెస్ఎస్ఆర్ రవి కుమార్, సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు చిరంజీవి, రాణి, యు.వెంకట రమణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరబాబు, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : మలేరియా జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమీజ్ అహ్మద్ కోరారు. గురువారం పీహెచ్‌సీలో పలు గ్రామాల వైద్య సిబ్బందితో ప్రపంచ మలేరియా దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా జ్వరాలపై తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు
- పరీక్ష రాయనున్న 934 మంది విద్యార్థులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25 : పాలిసెట్ 2024 పరీక్ష శనివారం జరగనుందని అద్దంకి కోఆర్డినేటర్ ఏపీ ప్రసాద్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ తాడికొండ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో 250 మంది, హోలిపెయింగ్ స్కూల్‌లో 334 మంది, కాకానిపాలెం జడ్పీహెచ్ఎస్‌లో 150 మంది, శింగరకొండలోని గురుకుల పాఠశాలలో 200 మంది మొత్తం 934 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. టెన్త్ హాల్ టికెట్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో పాలిటెక్నిక్ వెబ్‌సైట్ నుంచి టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులు పరీక్ష సమయం కన్నా ముందే 9.45 నిమిషాలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. బ్లూ, లేదా బ్లాక్ బాల్ పెన్, పెన్సిల్, ఎరైజర్ చాప్‌నర్, ప్యాడ్ తప్పని సరిగా తెచ్చుకోవాలన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో ఏదైనా సమస్య తలెత్తితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. 11 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో అద్దంకి విద్యార్థుల ప్రతిభ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ 2024లో అద్దంకికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలో పీబీవీ కామేశ్వరరావు 99.97 శాతం, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరీలో ఏఐఆర్ 527వ ర్యాంక్ సాధించినట్లు శ్రీ మమత ఐఐటీ ఫౌండేషన్ యాజమాన్యం గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. వీరితో పాటు మద్దినేని స్నేహ 99.46 శాతం, పి.దేవ మణికంఠ 97.40 శాతం మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు యాజమాన్యం అభినందనలు తెలిపారు. జెఈఈ మెయిన్స్‌లో అద్దంకిలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ విద్యార్థిని వై.కావ్య ఆల్ ఇండియా 243వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

సత్తా చాటిన సోపిరాల విద్యార్థి

చినగంజాం : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన నరహరి రోహిత్ శివశంకర్ జేఈఈ మెయిన్స్-2024 ఫలితాలలో ఈడబ్ల్యూఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో 176వ ర్యాంకు సాధించాడు. జాతీయ ర్యాంకు 1519 సాధించినట్లు రోహిత్ గురువారం తెలిపారు. తల్లిదండ్రులు పద్మ, శ్రీహరిరావు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తన తండ్రి శ్రీహరిరావు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పోటీ పరీక్షల కేంద్రాలలో అర్థ మ్యాథ్స్, వేదిక్ మ్యాథ్స్‌ను బోధిస్తున్నట్లు తెలిపారు. మే26న జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు శిక్షణ పొందుతున్నట్లు రోహిత్ శివశంకర్ తెలిపారు. రోహిత్‌ను కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పలు కార్యక్రమాలలో పాల్గొన్న గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 25 : మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గురువారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కశ్యాపురంలో టీడీపీ నేత ధూళిపాళ్ల రాజేష్ మాతృమూర్తి రాజ్యలక్ష్మి దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయనవెంట జడ్పీటీ సీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, ధూళిపాళ్ల రామచంద్రప్రసాద్, చల్లగుండ్ల కోటేశ్వరరావు, స్థానిక నేతలు ఉన్నారు.



రాజ్యలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొట్టిపాటి

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

చివరి రోజు 11 దాఖలు

చీరాల, ఏప్రిల్ 25 : ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజు 11 నామినేషన్లు దాఖలైనట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. రవికుమార్ శీలం (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), షేక్ అబ్దుల్ బషీర్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ), రవీంద్రబాబు పావులూరి (స్వతంత్ర అభ్యర్థి) దేవరపల్లి రంగారావు (స్వతంత్ర అభ్యర్థి) గోచిపాతల రమేష్‌బాబు (స్వతంత్ర), అంబటి పుష్పరాజ్ (స్వతంత్ర), జంజనం కృష్ణ (తెలుగు రాజాధికార సమితి పార్టీ), చెన్నుపల్లి పవన్‌కుమార్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ) వారి నామినేషన్లను ఆర్వోకు అందజేశారు. మద్దులూరి మాలకొండయ్య (తెలుగుదేశం పార్టీ), ఆమంచి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), ఆమంచి సుజాత (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సబ్స్టిట్యూట్) తరపున వారి ప్రతినిధులు ఆర్వోకు నామినేషన్లను అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 25 : విద్యార్థులు చదువుతో ఉన్నతంగా ఎదుగుతూ, తోటివారికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, అన్నారు. కళాశాలలో ఎమర్జింగ్ విభాగాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఇగ్నిటస్-2కె24 వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు కళాశాల ప్రతినిధులు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కా ర్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నానరు.

వైభవంగా సీతారామ కల్యాణ మహోత్సవం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

చినగంజాం, ఏప్రిల్ 25 : మండలంలోని నీలాయపాలెం గ్రామంలోని సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఆలయ అర్చకులు గంజాం శ్రీనివాసమూర్తి, గ్రామ పురోహితులు శిష్టాపాండురంగ శాస్త్రి స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి, వేశేష పూజలు, సహస్ర నామార్చన కార్యక్రమాలు జరిపారు. వేదపండితులు ముప్పాళ్ల నరేష్‌చార్యులు, రంగాచార్యులు వేదమంత్రాలతో కల్యాణ క్రతువును నిర్వంహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలను అందజేసిన అనంతరం అన్నసంతర్పణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో స్వామి అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్న 60వ అఖండ హరే రామ నామ సంకీర్తన సప్తాహం ముగిసింది. కార్యక్రమంలో ఒంగోలు రాధాకృష్ణ ఆశ్రమ పీఠాధిపతి వేణుమాధవ్, గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంతో ముస్లింలను భయపెడుతున్న వైసీపీ

- ఎన్డీయేలో టీడీపీ ఉన్నా మైనారిటీల రక్షణ బాధ్యత మాదే
- పట్టణవాసుల దాహార్తి తీరుస్తా
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి



ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 25 : ఎన్నికలలో వైసీపీ ఓటమి తప్పదని గ్రహించి, ముస్లింలను మభ్యపెట్టడానికి, భయపెట్టడానికి నానా ప్రయత్నాలు చేస్తోందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి అద్దంకి పట్టణంలోని 19వ వార్డులో గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ ద్వారా ప్రజలకు జరిగే లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడం వల్ల ముస్లింలు, క్రిస్టియన్‌లు నష్టం ఉంటుందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీతో ఉన్నప్పటికీ మీకు వచ్చిన నష్టమేమీ లేదన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది రాకుండా చంద్రబాబు చూస్తారని భరోసా ఇచ్చారు. గతంలో ఎన్డీయేతో టీడీపీ కలిసి ఉన్నప్పుడు ముస్లింల రక్షణ, సంక్షేమం విషయంలో చంద్రబాబు తీసుకున్న చర్యలను గొట్టిపాటి గుర్తు చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ అన్ని వర్గాల ప్రజల్లో భయాలను, లేనిపోని అనుమానాలను రేపుతోందన్నారు. విజ్ఞతతో ఆలోచించి వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఐదేళ్లు ముస్లింలను పట్టించుకోని జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తుకు రావడం ఆశ్చర్య మేస్తోందన్నారు. ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు, ఆస్తి నష్టాలు చేసిన వైసీపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. చంద్రబాబునా అధికారంలోకి వస్తే రాజధాని నిర్మాణం జరుగుతుందని, అందరితోపాటు ముస్లింలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా ఉన్నాయని, తాగునీటి సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి మసీదులో నమాజ్ చేశారు. ముస్లింల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎమ్మెల్యే రవికుమార్‌ను పెద్దసంఖ్యలో ముస్లిం లు సాదరంగా ఆహ్వానించారు. కార్య క్రమంలో కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, దామా సురేం ద్ర, దామా హనుమంతరావు, ముస్లిం నేతలు మదీనా, మాబు, మాలిక్, చిట్యాల శ్రీను, ఆ కుల కోటేశ్వరరావు, ఇక్కుర్తి శ్రీను, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు ... బాబీ ఇంటింటి ప్రచారం

బల్లికురవ, ఏప్రిల్ 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మెదటి నెల నుంచి వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందిస్తామని యువ నేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) తెలిపారు. గురువారం మండలంలోని భూషావారిపాలెం, రామాంజనేయపురం గ్రామాలలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలతోపాటు పింఛన్ అందిస్తామన్నారు. ఇప్పటి వరకూ గొట్టిపాటి చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని బాబీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారాబత్తిన అంజనేయులు, కొండేటి ఇజ్రాయల్, మంగారావు, బాలయ్య, కమతం శ్రీను, కుంచాల వెంకట్రావు, దాసు, ఆట్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.వంద కొట్టు..1700 పట్టు

- వలపర్లలో ఉపాధి కూలీలకు బంపర్ ఆఫర్
- సిబ్బంది మాయాజాలం

మార్టూరు, ఏప్రిల్ 25 : వందరూపాయలు ఇవ్వండి.. మీఖాతాకు రూ.1700 పడేలా సెట్ చేస్తామంటూ కొందరు సిబ్బంది ఉపాధి కూలీల నుంచి డబ్బులు గుంజుతున్నారు. మండలంలోని వలపర్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. వాస్తవంగా ఈ నెల 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీకి గతంలో రోజుకు రూ.272 ఇవ్వగా రూ.28 పెంచి రూ.300 ఇస్తున్నారు. వారం రోజులు ఎన్ఆర్‌జీఎస్‌పై నిబంధనలు ప్రకారం కూలీలు పని చేస్తే రూ.1800 డబ్బులు కూలీల బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే కూలీలు చేసిన పని ప్రకారం కొలతలను బట్టి వారికి వచ్చే వేతనాన్ని లెక్కిస్తారు. కొంతమంది కూలీలు వారంలో కొన్ని రోజులు పనికి రాకపోయినా.. పనులు తక్కువగా చేసినా వారికి తక్కువ మొత్తం డబ్బులు వారి ఖాతాలో జమ అవుతుంది. దీనిని ఆసరాగా చేసుకున్న సిబ్బంది కూలీలను మాయ చేస్తున్నారు. రూ.100 చొప్పున ఇస్తే మీ ఖాతాలో రూ.1700 జమ అయ్యేలా చూస్తామని చెప్పడంతో చాలా మంది కూలీలు వందేకదా అంటూ సిబ్బందికి డబ్బులు ఇస్తున్నట్లు తెలిసింది. వారిలో పురుషులు, మహిళా కూలీలు కూడా ఉన్నారు. వంద రూపాయలు పోతే పోయాయి తమ ఖాతాలో రూ.1700 జమ చేస్తే అంతే సంతోషమంటూ కూలీలు ఆశ గా ఎదురు చూస్తున్నారు. ఇదిలావుండగా ఇటీవల ఈ గ్రామంలోని ఫీల్డు అసిస్టెంట్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా కోడ్ ఉల్లంఘించినందులకు అతడిని విధుల నుంచి తొలగించారు. తాజాగా కూలీల నుంచి డబ్బులు వసూలు చేయడంపై ఉన్నతాధికారులు ఏమేరకు స్పందిస్తారో చూడాలి.

సచివాలయ నిర్మాణంలో డొల్ల

విరిగిన భీమ్‌లు..కప్పిపుచ్చేయత్నం చేసిన కాంట్రాక్టర్





నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం
పడిపోయిన భీమ్‌లు

అద్దంకి, ఏప్రిల్ 25 : పది కాలాల పాటు పటిష్టంగా ఉండాల్సిన ప్రభుత్వ భవనాలు నిర్మాణ దశలోనే కూలుతుండడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సచివాలయ భవనాల నిర్మాణ పనులను పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతోంది. అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో రూ.40లక్షల వ్యయంతో సచివాలయం భవన నిర్మాణం జరుగుతోంది. ఇంకా పనులు పూర్తి కాక ముందే కిటికీలపై పోసిన భీమ్ (బల్లలు) పడిపోయాయి. మరి కొన్ని కూడా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పడిపోయిన భీమ్‌ల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వస్తున్నారు. గ్రామ వైసీపీ నేతలే కాంట్రాక్టర్‌లు గా మారి నిర్మాణ పనులు చేస్తుండడంతో నాణ్యత లోపించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ దశలోనే కూలుతుండడంతో భవన నిర్మాణం పూర్తయినా ఎక్కువ సంవత్సరాలు ఉండదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.